క్లుప్తంగా

అన్నదాన మండపానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న గురుస్వామి నంబూద్రి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ముస్తఫానగర్ పెట్రోలు బంక్ పక్కన శ్రీ దివ్య మణికంఠ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమానికి బుధవారం గురుస్వామి పాకతిల్లం నారాయణ నంబూద్రి భూమి పూజ చేశారు. ఈ నెల 11 నుంచి డిసెంబర్ 25 వరకు 41 రోజుల పాటు మండల దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములు, భవానీలకు, మాలాధారణ చేసిన వారికి అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ చిర్రా రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు టీవీ పుల్లంరాజు, పుట్ట మల్లిఖార్జున్, బండారు ఏడుకొండలు, పసుపులేటి వెంకటేశ్వరరావు, పరమేశ్వరరావు, సామినేని రవి, బత్తుల విజయ్, శేఖర్, నందన్‌రావు, అర్జున్, రాంబాబు, భూపతిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటచలం, గోపి, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు సేవలు మరువలేనివి

నేలకొండపల్లి: నిరంతరం పేద ప్రజల కోసం పని చేసిన మీసా కోటేశ్వరరావు సేవలు మరువలేనివి అని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బోదులబండ గ్రామంలో బుధవారం కోటేశ్వరరావు దశదిన కర్మ నిర్వహించంగా.. రాయల హాజరై నివాళులర్పించాక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీసా ముత్తయ్య, ఎంపీటీసీ కట్టికోల సుధాకర్, కాంగ్రెస్ నాయకులు వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, అనంతు నాగేంద్రబాబు, యడవల్లి నాగరాజు, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నాచేపల్లిలో మృతి చెందిన యాతాకుల వెంకటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత ఆస్పత్రి 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మమత ఆస్పత్రి ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, మైసమ్మగుడి ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, పాకబండ ఏరియాలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. మమతరోడ్డు, గొల్లగూడెం రోడ్డు, మధురానగర్, వరదయ్యనగర్, తదితర ప్రాంతాల వారు విద్యుతసిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీపీఎం రాష్ట్ర నాయకురాలు బత్తుల హైమావతికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఖమ్మంకు కారులో వస్తుండగా మార్గమధ్యలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి..


ఖమ్మం మామిళ్లగూడెం: సోషల్ మీడియాలో వైద్యులపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఐఎంఏ బాధ్యులు సూచించారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నారాయణరావు, జగదీశ్ మాట్లాడుతూ.. వందలాది మంది విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దిన ఘనత మమతా ఆస్పత్రిదేనని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నతమైన ఆస్పత్రిగా వెలుగొందుతున్న మమతా ఆస్పత్రిపై అక్కసు వెళ్లగక్కడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను గాని, సామాన్య ఉద్యోగులను కాని ఇంత వరకు వేధింపులకు గురి చేసిన సంఘటనలు లేవని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ కిషన్, తన్మాయ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

11న మాదిగల విశ్వరూప మహాసభ..

తిరుమలాయపాలెం: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం మాదిగ, నేలకొండపల్లి ఇన్‌చార్జ్ పొట్టపెంజర బాలస్వామి, వెంకన్న, పగిడిపల్లి బాబు, దర్గయ్య, హనుమంతరావు, సలీం పాల్గొన్నారు.

తెగులు.. దిగులు!

వరిని ఆశిస్తున్న అగ్గి, సల్ల, ఆకు ముడత తెగుళ్లు
- విచ్చలవిడిగా మందులు పిచికారీ చేస్తున్న రైతులు
- వ్యయం పెరుగుతోందని దిగాలు
- దిగుబడులు తగ్గుతాయని ఆందోళన
- మండలంలో 6,252 ఎకరాల్లో సాగు



కొనలు ఎర్రబారిన వరి పొలం (ఇన్‌సెట్) తెగుళ్ల బారిన పడిన వరి పైరు

కామేపల్లి: మండలంలోని ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న వరి పంటలకు అకాల తెగుళ్లు సోకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు, బోరు బావుల కింద సుమారుగా 6,252 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రసుత్తం వరి సాగుకు సోకుతున్న అగ్గి, సల్ల, ఆకు ముడత తెగుళ్లతో రైతులు బెంబేలెత్తుతున్నారు. అధిక ధర పలుకుతున్న బీపీటీ సన్నాలను అధికంగా సాగు చేసినప్పటికీ ఈ రకం సన్నాలు చీడపీడలను తట్టుకోకపోవడంతో ప్రస్తుతం అనేక అటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం సాగు చేసిన పంటలు పొట్టల దశకు చేరుకోగా.. వాతావరణంలో అకాల మార్పులు, జింక్ దాతువు లోపంతో పొలాల్లో తెగుళ్లు అధికంగా సోకి కింద నుంచి పండు ఆకు అధికంగా కనిపిస్తూ.. ఆకుల కొనలు ఎర్రబడుతున్నాయి. దీంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విచ్చలవిడిగా మందుల వాడకం..

తెగుళ్ల విజృంభించడంతో ఆందోళన చెందుతున్న రైతులు విచ్చలవిడిగా పురుగుల మందుల పిచికారీ చేస్తున్నారు. సాధారణంగా ఒకటి లేదా రెండుసార్లు ఒక సాగుకు పురుగుల మందు వాడతారు. కానీ ప్రస్తుతం సోకిన తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకునేందుకు ఇప్పటికే రెండుసార్లకు పైగా మందులు కొడుతున్నారు. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 పంపుల పురుగుల మందును పిచికారీ చేస్తారు. ఇందులో వ్యవసాయ కూలీలకు ఎకరాకు రూ.500 నుంచి రూ.700 వరకు, పురుగుల మందు రూ.1,500 నుంచి రూ.2,500 ఖర్చవుతుంది. ఇలా మూడు, నాలుగు సార్లు పురుగు మందులను పిచికారీ చేయాల్సి రావడంతో ఖర్చు అమాంతం పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి పెరుగుతోంది..



ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతులకు ఈ సారి నిరాశ మిగిలింది. వరిలో చీడపీడలు ఆశించడంతో ఇప్పటికే పలు మార్లు పురుగుల మందు పిచికారీ చేశాం. దీంతో ఖర్చులు పెరిగిపోయి సాగు వ్యయం చేతికి అందుతుందో లేదో తెలియడం లేదు. వ్యవసాయ అధికారులు సూచనలు పాటించినప్పటికీ పురుగు ఉధృతి తగ్గడం లేదు.
– బానోత్ భీముడునాయక్, రైతు, పండితాపురం

దిగుబడి తగ్గే అవకాశం ఉంది..



ఆశించిన స్థాయిలో వరి సాగు దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదు. చీడపీడల ఉధృతి తీవ్రంగా ఉంది. ఇప్పటికే మూడు,నాలుగు సార్లు మందులు కొట్టాం. అయినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. అంతేకాక పెట్టుబడి ఖర్చు కూడా పెరుగుతోంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేస్తున్నాం.
– ఐతనబోయిన విఠల్‌రావు, రైతు, పండితాపురం

అప్రమత్తంగా ఉండాలి..



వాతావరణంలో మార్పుల వల్ల వరికి చీడపీడలు ఆశిస్తున్నాయి. నత్రజని వినియోగించవద్దని, పొలంలో నీటిని నిల్వ ఉంచకుండా ఆరుతడులతో పారిస్తే తెగుళ్లను నివారించే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు పంటలను పరిశీలిస్తూ రైతులకు సూచనలు చేస్తున్నాం. వ్యయసాయాధికారుల సూచనలతో తెగుళ్లను నివారించుకోవచ్చు.
– భూక్యా తారాదేవి, ఏఓ

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం..

రాష్ట్ర మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్


పార్టీలో చేరిన వారితో మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందుతూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని 28వ డివిజన్‌లో కాంగ్రెస్‌కు చెందిన పలు కుటుంబాలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. ప్రజలకు కాంగ్రెస్ చేసిందేమి లేదని, గత పదేళ్లుగా ఆ పార్టీ నాయకులు ఇక్కడ కనిపించలేదన్నారు. ఖమ్మం తన ఇల్లు అని, ఇక్కడ ప్రజలంతా తన కుటుంబ సభ్యులని మంత్రి అన్నారు. ఇక్కడ పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థి కేవలం రాజకీయ పదవులు, రాజకీయ అవసరాల కోసమే పోటీ చేస్తున్నారని, ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న అలాంటి వాళ్లను ఓడించి, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. జరుగుతున్న ఈ అభివృద్ధిని సాదుకుంటారో.. సంపుకుంటారో ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. పార్టీలో చేరిన వారిలో విద్యాసాగర్, పాషా, నరసింహాలు, మురళి, రమణ మేస్త్రి, అంజిబాబు, సుమన్, చిరంజీవి, నరసింహారావు, ఉపేందర్, ఉమా మహేశ్, వెంకటేశ్వర్లు, వీరేష్, బిబ్లా, వెంకన్నలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, కార్పొరేటర్ గజ్జల లక్ష్మి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కొప్పెర నరసింహరావు, రఘు, కోడి లింగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో మరోమారు ఆశీర్వదించండి..


సత్యనారాయణపురంలో మాట్లాడుతున్న కందాళ

ఖమ్మంరూరల్: పాలేరు స్థానిక బిడ్డగా తనను మరోమారు ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. తనకున్న దాంట్లో ఎవరు వచ్చినా లేదనకుండా తనవంతుగా సాయం అందించానని, పాలేరు భవిష్యత్‌కు తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సత్యనారాయణపురంలో ఓ చిన్నారి తాను మనీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులను ఎమ్మెల్యేకు నామినేషన్ ఖర్చుల నిమిత్తం అందించగా చిన్నారిని కందాళ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి, మట్టా వెంకటేశ్వరరావు, జర్పుల లక్ష్మణ్‌నాయక్, రామ్మూర్తినాయక్, ముత్యం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం..

రఘునాథపాలెం/నేలకొండపల్లి: రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మందడపు నరసింహారావు ఆధ్వర్యాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ.. గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ.. కారు గుర్తుకు ఓట్లు వేయాలని ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎన్నికల ఇన్‌చార్జ్ నూతలపాటి మధు, ఖమ్మం ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్యా రాము, తేజవత్ శంకర్, అర్వపల్లి భిక్షం, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లిలో పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమార్తెలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నా హయాంలో దందాలు లేవు..

ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు


ఖమ్మంవన్‌టౌన్: మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంఅర్బన్: తన హయాంలో చందాలు, దందాలు ఎన్నడూ లేవని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పెట్రోల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్, 7,10, 18వ డివిజన్ శ్రీరాంనగర్‌లో జిల్లా కార్పెంటర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనాలతో పాటు మహ్మద్ జావీద్ నివాసంలో ఏఐసీసీ పరిశీలకుడు మహ్మద్ ఆరీఫ్‌ఖాన్‌తో కలిసి ముస్లిం మైనార్టీ పెద్దల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ ఐదేళ్ల పాలనలో ఖమ్మంలో కబ్జాలు, దందాలు అవినీతి అరాచకం రాజ్యమేలిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య ప్రముఖుడు కొదుమూరి మధుసూధన్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా గాంధీచౌక్ నుంచి వర్తక సంఘ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తుమ్మలను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జావీద్, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, కమర్తపు మురళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, చోటేబాబా, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేరిక..

ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో బుధవారం పలువురు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆర్యవైశ్య సంఘ నాయకుడు కొదుమూరి మధుసూధన్‌రావు,ధంసలాపురం మాజీ సర్పంచ్ మందడపు బ్రహ్మారెడ్డి, వైసీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు తుమ్మా అప్పిరెడ్డి, గోవిందరెడ్డి, పొట్ట వెంకటేశ్వర్లు, పునగోటి వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, పసుపులేటి శ్రీను, రాఘవ, బొడ్డు ఉపేందర్‌లతో పాటు సుమారు వంద కుటుంబాలు చేరాయి. అదే విధంగా తెలంగాణ ఉద్యమకారుడు పానుగోటి సంపత్, ఓయూ జేఏసీ నాయకుడు అజయ్‌కుమార్, 44వ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు గుడిపూడి జగదీశ్, సునీత దంపతులు పార్టీలో చేరారు.

పొంగులేటి గెలుపునకు విస్తృత ప్రచారం


నేలకొండపల్లి: ముజ్జుగూడెంలో మాధురి ప్రచారం

ఖమ్మంరూరల్ / కూసుమంచి / నేలకొండపల్లి: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పొంగులేటి మాధురి నేలకొండపల్లి మండలం, కుమారుడు హర్షారెడ్డి, సోదరుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఖమ్మంరూరల్ మండలంలోని దారేడులో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలో ప్రసాదరెడ్డి, హర్షారెడ్డిలో కలిసి పాల్గొన్నారు. వారివెంట మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, రాంరెడ్డి, వెంకటరెడ్డి, వినోద, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, కొమ్మూరి నరేశ్, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, రేగూరి వాసవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఖమ్మంరూరల్ మండలం నడిమితండాలో ప్రసాద్‌రెడ్డి సమక్షంలో పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, హరినాథబాబు, భూక్యా సర్వర్‌సింగ్, బానోత్ ఎ.అశోక్, అవినాష్, సాయి, చరణ్, ధరావత్ సుశీల్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తే అధికారం కాంగ్రెస్‌దే..

ఖమ్మంవన్‌టౌన్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే కాంగ్రెస్‌దే అధికారం అని ఏఐసీసీ పరిశీలకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి మహ్మద్ ఆరీఫ్‌ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల ముఖ్యనేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రతీ గడపకు తీసుకెళ్లి వివరించాలన్నారు. నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాగండ్ల దీపక్‌చౌదరి, మానుకొండ రాధాకిషోర్, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, వైరా నియోజకవర్గ ఎల్‌డీఎం మద్దినేని రమేష్, చోటాబాబా, పాలకుర్తి నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, పీసీసీ సభ్యులు, బ్లాక్, పట్టణ, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) ఖమ్మం డిపో అధ్యక్షుడిగా దేశబోయిన జగన్నాథంతో పాటు కమిటీ సభ్యులను బుధవారం సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బేతంపుడి బుచ్చిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దిపాక వెంకటేశ్వర్లు, కోశాధికారిగా లాజర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమలలో అప్పారావు, రమేశ్, ఇనుపనూరి ఆదం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయంలో అభిషేక పూజలు

ఖమ్మం అర్బన్: నగరంలోని పదో డివిజన్ ఇందిరానగర్ కాలనీలో బాలగణపతి దేవాలయంలో బుధవారం రాత్రి సంకష్టహర చతుర్థి అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ అధ్యక్షుడు కార్యదర్శి భాజిని వీరయ్య, తిరుపతిరావు, ప్రధాన అర్చకులు గిరి ఆధ్వర్యాన తీర్థప్రసాదాలు అందించారు. వందలాదిమంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఇల్లెందు సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కామేపల్లి: ఇల్లెందులో జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు బుధవారం మండల బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్‌ఎస్ కార్యకర్తలను పెద్ద ఎత్తున హాజరయ్యేలా ప్రత్యేక వాహనాల్లో తరలిచ్చారు. సభకు తరలిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, ఎంపీపీ బానోత్ సునీత, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు అంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, కేళోత్ భాస్కర్, బోడేపూడి వీరప్రతాప్, కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

చలో పార్లమెంట్‌కు యూటీఎఫ్ నాయకులు..


తరలివెళ్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) పిలుపు మేరకు జాతీయ విద్యా విధానం-2020, జాతీయ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్)ను రద్దు చేయాలని, ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని కోరుతూ ఈ నెల 3వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న చలో పార్లమెంట్‌కు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు బుధవారం ఉదయం తరలివెళ్లారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కల్లూరి శ్రీకాంత్ ఆధ్వర్యాన నాయకులు రాయల నాగేశ్వరరావు, కొడిసెల విజయ్‌కుమార్, ఎం.పుల్లయ్య, కె.సతీష్, మట్ట చిన్న రామచంద్రప్రసాద్, జి.పాపయ్య, ఎం.రవికుమార్, జయశ్రీ, అనిత, సుధీర్, శ్రీనివాసరావు వెంకటేశ్వర్లు తదితరులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల తీరు నచ్చకే రాజీనామా..

ఖమ్మంరూరల్: బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, ఎంపీపీ ఉమా తీరు సరిగ్గా లేకపోవడం వల్లే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంపటి రవి అన్నారు. బుధవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని, వీరి వల్ల పార్టీకి జరిగే నష్టం గురించి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డికి చెప్పినందుకు తనపై కక్ష్యగట్టి వేధించడ వల్లే పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. తనతో పాటు మరికొందరు కూడా పార్టీకి రాజీనామా చేశారని అందరం కలిసి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సొంత పార్టీ వారిపైనే కేసులు పెట్టించారని పేర్కొన్నారు. ఈ విషయమై బెల్లం వేణు మాట్లాడుతూ.. వెంపటి రవిని గత మూడు రోజుల క్రితమే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

పాలేరులో ఎర్రజెండా ఎగురవేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేశ్ తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సోషల్ మీడియా కమిటీ పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేరులో ఎర్రజెండా ఔనత్యాన్ని చాటే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ధనార్జనకు లొంగకుండా నిజాయతీగా వామపక్ష అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర నాయకుడు పిట్టల రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.నవీన్‌రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ బాధ్యులు బోడపట్ల కార్తీక్, పొన్నం వెంకటరమణ, యమిని ఉపేందర్, వేటుకూరి సతీశ్, ఉమేశ్, నేరుసుల వెంకటేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేశ్ కోరారు. మండలంలోని మండ్రాజుపల్లిలో నెల్లూరి కూశయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ప్రభుత్వాలు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయని, పేదల సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలంటే సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు. పెద్దిరాజు నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకన్న, దండా రాధాకృష్ణ, గోవిందరావు, వెంకటనర్సయ్య, రమేశ్, వెంకటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఖమ్మం రాపర్తినగర్: మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 15న ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా మాలమహానాడు కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ కౌన్సిలర్ కాళంగి దేవదానం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాలలందరినీ ఏకంచేసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన కాళంగి దేవదానంను మాల మహానాడు జిల్లా కమిటి ఆధ్వర్యాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరద నరసింహారావు, జిల్లా కన్వీనర్ దామల్ల సత్యనారాయణ, తొగరు రమేష్, గంధమాల సంగయ్య, బూర్గుల రవికుమార్, మేకల అఖిల్‌కుమార్, పిట్టల రాజేశ్, కుమ్మరి గోపిచరణ్, మాలమహానాడు యువజన నాయకులు, మాలమహానాడు జిల్లా సెక్రటరీ పెరంపల్లి నాగార్జున, కాలంగి ఫిలిప్, కాలంగి యోబు, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహంలో తన కొడుకుకు సీటు కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఎస్సీ బాలుర (సీ) వసతిగృహం వార్డెన్ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ సంఘాల జిల్లా కార్యదర్శులు వి.వెంకటేశ్, జి.మస్తాన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపంథా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్, స్థానిక సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మస్తాన్‌లు మాట్లాడారు. ఈ ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో ఇదే వసతిగృహంలో అనేక సంఘనలు జరిగాయని, అధికారులు వసతిగృహంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టులో వసతి గృహ విద్యార్థిని కొట్టిన సమయాన వార్డెన్ శ్రీధర్‌ను ఖమ్మం నుంచి బదిలీ చేసిన అధికారులు నాటి నుంచి రిలీవ్ చేయకుండా కాపాడుకుంటూ వచ్చారని అన్నారు. విద్యార్థి తల్లీ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై ఏఎస్‌డబ్ల్యూఓతో విచారణ చేయించి ఎలాంటి చర్యలు తీసుకోకుండా పాత ఆర్డర్స్‌తో బుధవారం సదరు వార్డెన్ కూసుమంచిలో జాయిన్ కావడం ఏమిటని ప్రశ్నించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎస్సీ జిల్లా అధికారులపై ఉద్యమానికైన వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ ఖమ్మం డివిజన్, నగర కార్యదర్శులు లక్ష్మణ్, కరుణ్, నాయకులు శ్రీకాంత్, పృథ్వి, మల్సూర్, ఆర్కే, సాగర్, యువతేజ్, కిరణ్, సంపత్ పాల్గొన్నారు.

సీఎంతో నేతలు!


సీఎంతో కరచాలనం చేస్తున్న గుండాల కృష్ణ

సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరులో బుధవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఖమ్మంకు చెందిన పలువురు నాయకులు సభలో పాల్గొని సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.


సీఎంతో కరచాలనం చేస్తున్న చింతనిప్పు కృష్ణచైతన్య